telugu

# సువార్త అనగా నేమి?

What is the Gospel ?

"ప్రభువైన యేసు క్రీస్తు గలిలయలోను సునగోగులలోను సంచరించుచు బోధించిన వర్తమానమే సువార్త" మత్తయి 4:23 యని బైబిలు చెప్పుచున్నది. ఆయన శిష్యులు కూడా ఈ సువార్తనే బోధింపసాగిరి. యేసు క్రీస్తు జీవిత మరణ పునరుత్థానములందు కూడా శిష్యులతో "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్త ప్రకటించుడి" మార్కు 16:15 అని నేర్పించెను.

సువార్తఅనగా నేమి? క్రీస్తు బోధించిన ఆ వర్తమానమేమైయున్నది? ఈ సువార్త స్త్రీ పురుషుల కెట్లు చెందియున్నది? ఈ దినములలో దీని ప్రాముఖ్యత ఎంత? అను ఈ విషయములకు జవాబు నిచ్చుట ఈ పుస్తకపు ముఖ్యోద్దేశము గాన చదువరులు క్రీస్తు ఏ సత్యమును బోధించెనో గ్రహించ కోరుచున్నాము.

## శుభవార్త

## Good News

"సువార్త" అనగా శుభవార్తనుండి వచ్చినమాట. ఆంగ్లభాషలో దీనిని "గోస్పెల్" అని అందురు. అనగా - శుభవార్త యని అర్థము. గ్రీకు భాషలో ఈ సువార్తను "ఎవాంజలికన్" అనియు, దీనినే ఆంగ్లములో (glad tidings) గ్లేడ్ టైడింగ్సు అనబడును. అనగా బాగుగా కట్టబడుట యని అర్థము. ఈ పేరులోనే దీని అర్థము ఇమిడి యున్నది. సువార్త అనగా సృష్టి యావత్తుకు సంతోషానందముల నివ్వనైయున్న శుభవార్తయే.

సువార్త అను ఈ శుభవార్త నిరీక్షణను గూర్చిన వర్తమానమని బైబిలుయొక్క అంతరార్థము. పందొమ్మిది శతాబ్దముల క్రితము దేవుని కుమారుడు తన అనుచరులకిచ్చిన ఈ నిరీక్షణే శుభవార్త. నేటి కాలమున మనకు అదే నిరీక్షణ

సంతోషమును కలిగించునా? మానవజాతి అంతటిలో ప్రతి మానవుడు తాను చనిపోవుదునని ఎరిగినవాడే. తన జీవితకాలములో తనను ఏదో సమయాన మరణము మ్రింగివేయునని యు, ఈ మరణము జీవమునకు వ్యతిరేకమైనదని గ్రహించుచున్నాడు. ఇట్టి మానవ అనుభవములను గూర్చి బైబిలు గ్రంథము ప్రత్యేకముగా చెప్పుచున్నది.

"బ్రతికియుండువారు చత్తురని ఎరుగుదురు. అయితే చచ్చినవారు ఏమియు ఎరుగరు; వారి పేరు మరువబడియున్నది. వారిక ప్రేమింపరు, పగపెట్టుకొనరు, అసూయపడరు. సూర్యుని క్రింద జరుగు వాటిలో దేనియందు వారికిక నెప్పటికిని వంతులేదు" ప్రసంగి 9:5,6.

సువార్త అనగా మానవాళిని భయంకరమైన ఈ జీవితము నుండి రక్షించి నిరీక్షణ కలిగించు సర్వలోక ప్రజలకు శుభవార్తయైయున్నది. సువార్తను గూర్చి నేను సిగ్గుపడువాడనుకాను" రోమా 1:16 అని క్రీస్తు సువార్తనుగూర్చి పౌలు వ్రాయుచున్నాడు. ఈ వర్తమానము నమ్మువారిని నిత్యత్వమునుండి ధూరముచేయు మరణమునుండి రక్షింపగలుగుట ఈ సువార్తయందలి ఆశ్చర్యమని పౌలు వక్కాణించుచున్నాడు.

## బైబిలునందలి అసాధరణమైన నిరీక్షణ

## The Bible's Unique Hope

ఆదిలో క్రీస్తు అనుచరులు ఈ సువార్తను అసాధారణమైన వర్తమానమని గొప్పగా ధృఢపరచిరి. "యేసుక్రీస్తు చెప్పిన ఈ శుభవర్తమానమునందలి మూలాంశములను గూర్చి యేసుక్రీస్తు అను యీ నామము ద్వారానే తప్ప ఆకాశముక్రింద నియ్యబడిన మరి ఏ నామమునను రక్షణ పొందలేము" అపొ.కా. 4:12 అని పేతురు చెప్పెను.

జీవిత మరణములనుగూర్చిన యీ వర్తమానము ప్రప్రథమముగా "యేసుక్రీస్తు....... మరణమును జయించి సువార్త ద్వారా వెలుగుకు జీవమును నిత్యత్వమును తెచ్చెను" 2తిమొథి 1:10 అనిమొదటి బోధకుడు వ్రాసెను. "మరి ఏ నామమున రక్షణలేదు" అని చెప్పుటలో ఏ యితర మతములుగానీ, నమ్మికలుగాని యీ రక్షణ కలిగించ

లేనివిగాను బయటకు వ్రాయబడుటయే దాని అర్థము. ఇట్టి వర్తమానములో ఏ సంచలనములు, మార్పులు లేనట్లుగా కూడా పౌలు దృఢముగా ప్రాచీన విశ్వాసులకు యీ సువార్తను గూర్చి యిట్లు వ్రాయుచున్నాడు.

"మేమిదివరకు చెప్పిన ప్రకార మిపుడును మరల చెప్పుచున్నాము. మీరు అంగీకరించిన సువార్తగాక మరి యొకటి యెవడైనను మీకు ప్రకటించినయెడల వాడు శాపగ్రస్తుడవునుగాక" గలతి 1:9

ఇట్టి సత్యమైన సువార్తపై లక్ష్యములేకుండా క్రీస్తు అనుచరులలో అనేకమైన వేరువేరు సువార్తలు యీ దినములలో ప్రకటింపబడి నమ్మికలు కలిగియున్నారు. గనుక ఏ సువార్తయైనను ప్రకటింపబడినపుడు మనము బైబిలు గ్రంథమును పరిశీలించి సత్యసువార్తకది అనుకూలమైనదో కాదో పరిశీలించుట ఎంతైనా అవసరమైయున్నది.

మనము చదువుచున్న బైబిలు గ్రంథమందలి సువార్త దాదాపు 1900 సంవత్సరముల క్రితము బోధింపబడిన సువార్త. ఇది క్రీస్తు యేసు అప్పటి కాలమున ఆయనతో నున్నవారికి యొదట బోధించిన క్రొత్త నిబంధన వ్రాతలు. యేసు క్రీస్తు జీవించినపుడు యీసువార్త వారికి అర్థముకాలేదు గాని తదుపరి ఆయన అనుచరులు అనేకులు యీరక్షణ సువార్తను గూర్చియు పాత నిబంధన దానినెట్లు ఋజువుచేయుచున్నదో గ్రహించిరి ప్రాచీన కాలములో యూదులనేకులు ఈ సువార్తను నమ్మిరి. ఈ సువార్తను గూర్చి ఆ కాలములో అనేక బోధకులు ప్రయోగాత్మకముగా యూదామత లేఖనముల నుండి పరిశీలనచేసి "మోషే, ప్రవక్తలు చెప్పినవికాక మరి ఏమియు చెప్పక..... సాక్ష్యమిచ్చుచుంటిని" అపొ.కా. 26:22 అని పౌలు పాత నిబంధననుగూర్చి అపొ.కా.28:23 చెప్పుచు, యూదా సమాజమువారి యొద్దకు వెళ్ళి మూడు విశ్రాంతిదినములు లేఖనములలో నుండి దృష్టాంతముల నెత్తి అపొ.కా 17:2 చూపి వారిని తర్కించుచుండెను.

ఆ విధముగా మొదటి క్రైస్తవులు పాత నిబంధనయందనేక భాగములు క్రొత్త నిబంధనలో నెరవేరబడుటను, వివరింపబడుటను గ్రహించిరి. అట్టి ఆది క్రైస్తవులకు పాత నిబంధనలోని కొన్ని లేఖన భాగమునందలి సువార్త విషయము బైబిలుగా

కలిగి, ఇట్టి సువార్త మొదట అబ్రాహామునకెట్లు ప్రకటింపబడెనో దానిని వారికి బోధించెను. క్రొత్త నిబంధనయందు కనుగొనబడిన సువార్త పాత నిబంధనతో ఎట్టి అపసరత లేకున్నది. ఏలయనగా పాత నిబంధనయందు వ్రాయబడినది క్రొత్త నిబంధన బలపరచుటచే యీ సువార్తలో యీ రెండింటికి ఎట్టి భేదములేదు. గలతీ 3:6.

## సువార్తయందలి ప్రధానంశములు
## he Element of the Gospel

దేవుని వాక్యమును గూర్చిన సువార్త ప్రధానమైన శుభవార్తయైయున్నది. "యేసుక్రీస్తు, పట్టణములలోను గ్రామములందు సంచరించుచు సునగోగులందు రాజ్యసువార్త ప్రకటించుచుండెను" మత్తయి 4:23. "యేసు గలిలయకు వచ్చి దేవుని రాజ్యమునుగూర్చిన సువార్తను ప్రకటించుచుండెను" మార్కు 1:14. అన్నిచోట్ల యేసు చెప్పిన సంగతులను వినుటకు ఆయనను వెంబడించినపుడు "ఆయనవారిని చేర్చుకొని వారికి దేవుని రాజ్యసువార్త ప్రకటించెను" లూకా 9:11.

అనేకమంది క్రైస్తవ బోధకులు యీ దినములలో దేవునిరాజ్య సువార్తను వదలివేసి క్రీస్తు మరణ పునరుత్థానములను గూర్చి విచారించుచు సువార్త యందలి మహిమ ఇదేనని భావించుచున్నారు. కాని క్రీస్తు రాజ్యము మాత్రము ఎన్నడును మారదు. ఇట్టి దేవుని రాజ్యమునుగూర్చిన సువార్త క్రీస్తు తన మరణమును గూర్చి చెప్పిన తరువాత కూడా ప్రకటించెను. "వారాయనను విడచి పట్టణములగుండా సువార్తను ప్రకటించుచు అనేకులను స్వస్థపరచెను" లూకా 9:6. క్రీస్తు తన మరణమును ఎరిగెను గాని శిష్యులది యెరుగరు. పరోక్షముగా క్రీస్తు తన మరణమును గూర్చి "మనుష్యకుమారుడు అనేక శ్రమలను అనుభవించి ..... మరియు చనిపోయి మూడవదినమున తిరిగి లేచునని బోధించెను గాని వారా మర్మమును గ్రహింపకుండిరి" లూకా 9:22,45. ఆదినములలో దేవుని రాజ్య మర్మములు ఆయన శిష్యులు గ్రహించలేనట్లుగా నేటి కాలములో లేదుగాని దేవునిరాజ్యపు మర్మములందరికి అనుగ్రహింపబడెను.

ఈ సువార్త కేవలము దేవుని రాజ్యమునుగూర్చి మాత్రమే కాదుగాని యీనాడు స్త్రీపురుషులందరకు ఆశీర్వాదమును అనుగ్రహించు నిరీక్షణయైయున్నది. అదియుగాక యేసుక్రీస్తు శిష్యులు ఆయన మరణ పునరుత్థానము తదుపరి కూడా యీ వర్తమానమునే బోధించుట మరియొక విశేషము. అదేమనగా యేసుక్రీస్తు నామమున సమరయలో ఫిలిప్పు చేసిన బోధలనుగురించి చూడుము "అయితే ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు, యేసుక్రీస్తు నామమును గూర్చియు సువార్త ప్రకటించుచుండగా వారతనిని నమ్మి పురుషులును స్త్రీలును బాప్తిస్మము పొందెను" అపొ.కా. 8:12. అట్లే పౌలు కూడా మోషే ధర్మశాస్త్రమునుండియు ప్రవక్తల ప్రవచనములనుండియు యేసుక్రీస్తును గూర్చియు ఆయన రాజ్యమునుగూర్చియు ప్రత్యేకముగా ఋజువుచేయుచు వాటిని పరిశీలనముచేయుచు నిరూపించినాడు. "మరియు పౌలు తనయొద్దకు వచ్చినవారినందరిని సన్మానించి ఏ ఆటంకములేక పూర్ణధైర్యముతో దేవుని రాజ్యమునుగూర్చి ప్రకటించుచు ప్రభువైన యేసు క్రీస్తును గూర్చిన సంగతులు బోధించుచుండెను" అపొ.కా. 28:23, 30, 31.

మనుష్యులు క్రీస్తును బలిగావించినప్పటికిని దేవుడు ఆయనను మృతులలోనుండి లేపనను విషయము అతిప్రాముఖ్యమైనది. ఈ విషయము కూడా యేసు క్రీస్తు నామమున బోధింపసాగిరి. పేతురు- "మీరు సిలువవేసినట్టియు మృతులలోనుండి దేవుడు లేపినట్టియు నజరేయుడైన యేసు క్రీస్తు నామమునేపల్కెను" అపొ.కా. 4:10. అట్టి దేవునిరాజ్యమునుగూర్చి ఆయన శిష్యులు ప్రకటించిన రీతిగా నేటికార్యములు కూడా జరుగుచునే వున్నవి.

క్రీస్తు మనకు రక్షకుడుగా చనిపోయి మరణమును జయించిన రీతిని అందరును అట్లు పొందవలెనని ఆయన కోరుచున్నాడు. క్రీస్తు అనగా రక్షకుడు అని అర్థము. అనగా మరణము నుండి విడుదల చేసి దేవుని రాజ్యములోనికి క్షయమైన మానవునిగా నడిపించుటయే ఆయన కోరిక, ఆయన జీవిత మరణ పునరుత్థానము లేనియెడల దేవుని రాజ్యము క్రీస్తు స్థాపించుట అసంభవము. ఇట్టి సువార్తలో ఏ భాగమైనను పరిశీలనకు అందనియెడల అది కేవలము అసంపూర్ణమైనది. అట్లుగాక పరిపూర్ణమైనదిగను క్రీస్తు చర్యలనుబట్టి ఆయన రక్షకుడుగాను, రాజుగాను,

ప్రభువుగాను, దేవుని రాజ్యమునకు ఆయన వారసుడుగాను బోధించెను. సువార్తను ఏ కోణమునుండి పరిశీలించినను యేసు క్రీస్తు రక్షకుడుగాను, రాజుగాను తన అనుచరులనేకులు నిరూపించిరి.

## భూమిమీద పరలోక రాజ్యము

## Heavenly Kingdom on Earth

దేవుని రాజ్యమును గూర్చియు (**Kingdom of God**) పరలోకరాజ్యమును గూర్చియు (**Kingdom of Heaven**) ప్రత్యేకముగా వ్రాయబడియున్నది. దేవుని రాజ్యమునకును పరలోక రాజ్యమునకును సంబంధమేమియులేదు. ఏలయనగా దేవుని రాజ్యము భూమిమీదకు వచ్చును. అనగా పరలోకమందున్న రీతిగా భూమిమీదకూడ నెరవేరవలెనని యేసు "నీ రాజ్యము వచ్చునుగాక నీ చిత్తము పరలోకమందు నెరవేరునట్లు భూమి మీద నెరవేరునుగాక" యని ప్రార్థించెను మత్తయి 6:10. అనగా దేవుని రాజ్యస్థాపన ఎప్పుట కలదో ఇందు మనము చూడగలము "సాత్వికులు ధన్యులు వారు భూలోకమును స్వతంత్రించుకొందురు" మత్తయి 5:5. అని వ్రాయబడియున్న ప్రకారము పరలోక నిర్ణయమును గమనించగలము. ఆ విధముగా యేసు క్రీస్తు యీ భూగ్రహమునుగూర్చిన మంచి భవిష్యత్తును పదేపదే గర్తింపజేసెను. అట్లే పాత నిబంధనయందు కూడా భూమిని గుర్చి వ్రాయబడెను.

"ఏలయనగా సముద్రము జలములతో నిండియున్నట్లు భూమి యెహోవా మహిమనుగూర్చిన జ్ఞానముతో నిండుకొని యుండును" హబ.2:14.

"దీనులు భూమిని స్వతంత్రించుకొందురు. బహుక్షేమము కలిగి సుఖించెదరు" కీర్తన 37:11.

పరలోకరాజ్యము భూమిమీద స్థాపింపబడునపుడు అది దేవుని రాజ్యముగా బైబిలు చెప్పుచున్నది. అటువంటి రాజ్యము స్థాపింపబడుటకు పరిష్కారము జరుగుచున్నదా? అట్టి దేవుని రాజ్యమును గూర్చి యేసు క్రీస్తు చెప్పిన దేవుని రాజ్యములోనికి ప్రవేశించుటకు నియమించిన మార్గములను, సూత్రములను లోకము అనుసరించుచున్నదా? అది ఏమాత్రము పొందలేదు. క్రీస్తు బోధించిన సువార్త

కాలమునాటి కంటే నేటికాలము బహు కష్టతరమాయెను. ఇంకను భూమి మీద దేవుని రాజ్యము స్థాపింపబడలేదు. ఆయన జ్ఞానము, ఆయన మహిమ భూమిని నింపలేదు. దీనులు భూమిని స్వతంత్రించుకొనలేదు. సంపూర్ణ సమాధానము భూమిమీదకు ఇంకనూ రాలేదు. అయినను భవిష్యత్తులో స్త్రీ పురుషులు ఇష్టిషరతులను పొందగలరను ఉద్దేశ్యము ఎన్నడు లేదు చివరి ఫలితార్థముగా గోళమునందలి మానవ సమస్యలను తీర్చు మార్గము లేదని తేలినది. కాని బైబిలు మాత్రము దేవుని శక్తి చేత భూమిమీద రాజ్యమును స్థాపించి లోకరాజ్యపాలనలన్నిటిని అంతమొందించి ఆయన శక్తియే పాలనచేయునని చెప్పుచున్నది. "ఆ రాజుల కాలములో పరలోకమందున్న దేవుడు ఒక రాజ్యము స్థాపించును. దానికెన్నటికిని నాశనము కలుగదు. ఆ రాజ్యము దాని పొందినవారికిగాక మరెవరికిని చెందదు. అది ముందు చెప్పిన రాజ్యములన్నిటిని పగులగొట్టి నిర్మూలముచేయును. కాని అది యుగయుగములు నిలుచును" దానియేలు 2:44.

మరియు పాడైన భూమిని తిరిగి దేవుని రాజ్యముగా నగుటను గూర్చి ప్రవక్తయైన యెషయా ప్రవచించినట్లు రెండు చోట్ల చూడగలము.

"ఆయన మధ్యవర్తియై అన్యజనులకు న్యాయము తీర్చును, అనేక జనములకు తీర్పు తీర్చును. వారు తమ ఖడ్గములను నాగటి నక్కులుగను తమ యీటెలను మచ్చు కత్తులుగను సాగగొట్టుదురు. జనముమీదికి జనము ఖడ్గమెత్తకయుండును. యుద్ధముచేయ నేర్చుకొనుట మానివేయును" యెషయ 2:4.

"ఇదిగో నేను క్రొత్త ఆకాశమును క్రొత్త భూమిని సృజించుచున్నాను. ద్రాక్షతోటలు నాటించుకొని వాటి ఫలములను అనుభవింతురు. వారు కట్టుకున్న యిండ్లలో వేరొకరు కాపురముండరు. వారు నాటుకొన్నవాటిని వేరొకరు అనుభవింపరు....... వారు వృధాగా ప్రయాసపడరు..., తోడేళ్ళును గొర్రెపిల్లలును కలిసి మేయును. సింహము ఎద్దువలె గడ్డి తినును........... నా పరిశుద్ధ పర్వతములో అవి ఏ అపాయమైనను నాశనమైనను చేయకుండును అని యెహోవా సెలవిచ్చుచున్నాడు" యెషయ 65:17-25.

## సువార్తయందలి నిరీక్షణ

## The Hope of the Gospel

"చిన్నమందా భయపడకుము. మీకు రాజ్యము అనుగ్రహించుటకు మీ తండ్రికి ఇష్టమైయున్నది " లూకా 12:32, అని క్రీస్తు చెప్పిన మాటలలో తన్ను వెంబడించినవారికి ఆ స్వాస్థ్యము నివ్వ ఇష్టపడుచున్నాడని గ్రహింపగలము యాకోబు 2:5. వారందరుకూడ దేవుని రాజ్యమునకు వారసులు. దానిని స్వతంత్రించుకొనునట్లు వాగ్దానపూర్వకముగా ప్రేమించెను. అట్టి దేవుని రాజ్యము పొందు ప్రతివానికి సువార్తయే నిరీక్షణయైయున్నది.

సువార్తయందలి నిరీక్షణయును " కొలస్స 1:23 ఈ మాట ప్రవచన పుస్తకమైన ప్రకటన గ్రంథమందు బాహాటముగ వ్రాయబడియున్నది. నిరీక్షణ ఏమనగా "దేవునికి వారిని ఒక రాజ్యముగాను యాజకులుగాను చేసితని. గనుక వారు భూలోకమందు ఏలుదురు" ప్రకటన 5:10. ఈపని ద్వారానే దేవుని ఉద్దేశ్యమునుబట్టి భూమి ఆయన మహిమతో నిండుకొనునట్లు రాజులను, యాజకులకు నియమింపబోవుచున్నాడు. మరియు జనులు తూర్పునుండియు, పడమటనుండియు, ఉత్తరమునుండియు, దక్షిణమునుండియు వచ్చి దేవుని రాజ్యమందు కూర్చుందురు లూకా 13:29. ఇదియే నశించుచున్న మానవునికి దేవుడనుగ్రహించు నిరీక్షణయైయున్నది. అయితే కొందరు చనిపోయిన తరువాత తనలో ఉన్న కొన్ని భాగములు అట్లె జీవించియుండుట దైవనిర్ణయముగ తలంచుచున్నారు. కానీ బైబిలుమాత్రము మరణమునది "శిక్ష" యనియు, మానవుడు "చనిపోయిన తర్వాత తిరిగి మంటికి చేరబడుచున్నాడని, ఆ దినమే తన ఆలోచనలు నాశనమగునని చెప్పుచున్నది " కీర్తన 147:4 మానవుడు భూ సంబంధియని మరణము కూడా తెల్పుచున్నది. అయినను ఒకానొక సమయమందు భూమిమీద మరణించిన ప్రతి వ్యక్తి తిరిగి బ్రతుకుదురని అపొ.కా. 24:15 బైబిలు చెప్పుచున్నది. ఇందుకు ఋజువుగా:-

"సమాధులలో నిద్రించిన అనేకులు మేల్కొనెదరు కొందరు నిత్యజీవము

అనుభవించుటకును" దానియేలు 12:2....... అను వాక్యము ద్వారా మొదట పునరుత్థానము పొందువారికి నిత్యజీవము బహుమతి అయియున్నది. పునరుత్థానమును, నిత్యజీవపు వరమును మానవుడు పొందునపుడు మాత్రమే దేవుని రాజ్యస్థాపనకు ముందుగా దీనమనస్సు గలవారు భూమిని స్వతంత్రించుకొందురు. పందొమ్మిది వందల సంవత్సరముల క్రితము చనిపోయిన పౌలు కూడా రాబోవు పునరుత్థానములో పొందబోవు బహుమతి కొరకు నిరీక్షించినాడు. ఏలయనగా "చనిపోయినవారు లేపబడనియెడల నాకేమి ప్రయోజనము" 1కొరింథి 15:32 అని చెప్పుటలో పునరుత్థానము లేని యెడల, దేవుని రాజ్యస్థాపనలేదు, నిరీక్షణ ఇక ఏమియులేదు.

## భూత భవిష్యత్ కాలములందు దేవుని రాజ్యము
## The Past and Future Kingdom

రాబోవు కాలములో స్థాపింపబోవు దేవుని రాజ్యము ప్రాచీనకాలమందే వ్రాయబడెను. పూర్వకాలపు ఇశ్రాయేలు రాజ్యమునుగూర్చి పరిశీలించినపుడు "ఇపుడు దావీదు సంతతివారి వంశముననున్న యెహోవా రాజ్యముతో" 2కొరింథి 13:3 అని వ్రాయబడుటలో ఇశ్రాయేలీయుల రాజ్యము దేవుని రాజ్యమాయెనని అర్థము. రానురాను దావీదు సంతానము యెరూషలేము పాలించుచుండగా దేవుడు వారి దుష్టత్వమును బట్టి క్రీస్తు పూర్వము ఐదువందల సంవత్సరములు వారిని రాజ్య భ్రష్టులనుగా జేసెను. మరలా అట్టి దేవుని రాజ్యము రాబోవుకాలములో నిర్మింపబడి లోకమునకు ఉత్తేజమును కలిగించుచు "యెహోవా సీయోను కొండయందు ఇప్పటి నుండి శాశ్వతకాలమువరకు వారికి రాజుగా ఉండును...... మునుపటిలాగున యెరూషలేము కుమార్తెమీద నీకు ప్రభుత్వము కల్గును" మీకా 4:7,8. అనగా దేవుని రాజ్యము పాలించిన దావీదు సింహాసనము మరియొకసారి క్రీస్తు అధిష్ఠించును. ఏలయనగా "ప్రభువైన దేవుడు ఆయన తండ్రి అయిన దావీదు సింహాసనము ఆయనకిచ్చును" లూకా 1:32 ఇచ్చుట క్రీస్తు అను పదమునకు అభిషేకము పొందినవాడు అని గ్రీకుభాషలో అర్థమిచ్చుచున్నది. అనగా ఆ రాజ్యమునందు అభిషేకము నొందినవాడు తప్ప మరి యెవరికిని రాజ్యమును పాలించు అధికారము లేదు.

హెబ్రీభాషలో మెస్సయా యని పిలుచుదురు. అనగా దేవునిచేత పంపబడిన పరిపాలకుడు అని యూదులు విశ్వసించుచు రాజైన దావీదు రాజ్యమందు మరియొకసారి పునరుత్థానముకొరకు ఎదురుచూచుచున్నారు.

## ఇశ్రాయేలీయుల నిరీక్షణ
## he Hope of Israel

తిరిగి సమకూర్చబడుచున్నట్టి రాజ్యములో మెస్సయా రాజుగా పాలించుటయే ఇశ్రాయేలీయుల నిరీక్షణ అయియున్నది. ఇట్టి నిరీక్షణ క్రీస్తు మొదటి అనుచరులుకూడ పొందియున్నట్లు పౌలు వ్రాతల ద్వారా "ఇశ్రాయేలు యొక్క నిరీక్షణ కోసరము యీ గొలుసుతో కట్టబడియున్నానని వారితో చెప్పెను" అపొ కా. 28:20. ఆ విధముగా మొదటి క్రైస్తవులు అనేకులు యూదులకు వేరై క్రీస్తును నాయకునిగాను ఆయన స్థాపింపబోవు రాజ్యమే వారి నిరీక్షణగాను కలిగియుండిరి.

అట్టి నిరీక్షణమునుగూర్చి వారు ప్రత్యేక శ్రద్ధ కలిగి "ప్రభువా, యీ కాలమందు ఇశ్రాయేలునకు రాజ్యమును అనుగ్రహించెదవా?" అపొ.కా 1:6 అని అడిగిరి. దేవుని రాజ్యస్థాపన యేసు మొదటి ఉద్దేశ్యమగుటచేత ఆ ప్రశ్న కెట్టి వ్యతిరేకత చూపలేదుగాని అది ఎప్పుడు స్థాపింపబడునో గ్రహించుట మానవుల కసాధ్యమనియు "మొదటిసారిగా లోకమంతయు సువార్త ప్రకటింపబడవలెనని" అపొ.కా. 1:8 తెల్పెను. ఈ సమయమందే క్రీస్తుపైకెత్తబడుచుండగా మేఘములు ఆయనను కమ్మెను. అప్పుడు ఇద్దరు దూతలు "మీయొద్దనుండి పరలోకమునకు చేర్చుకొనబడిన యీ యేసే, ఏరీతిగా పరలోకమునకు వెళ్ళుట మీరు చూచితిరో ఆరీతిగానే ఆయన తిరిగి వచ్చునని వారితో చెప్పిరి" అపొ.కా. 1:11 ఈ సాక్ష్యమును వినినవారనేకులతో చెప్పిరి.

పై సాక్ష్యమునుబట్టి క్రీస్తు ఏవిధముగా పైకెత్తబడెనో ఆ విధముగా రానైయున్నాడని గ్రహించగలము. కాబట్టి క్రీస్తునందు నిజమైన శిష్యులు ఆయన రాకడకొరకు ఎదురు చూచుచున్నారు. "దేవుని యెదుటను సజీవులకును మృతులకును తీర్పుతీర్చు క్రీస్తు యేసు ఎదుటను" 2 తిమోథి 4:1 అనగా దేవుని రాజ్యస్థాపనయందు మృతుల పునరుత్థానమును యేసు క్రీస్తు ద్వారా తీర్పును అప్పుడే

జరుగును. "తనకొరకు కనిపెట్టుకొనియుండువారి రక్షణ నిమిత్తము పాపములేకుండా రెండవసారి ప్రత్యక్షమగును" హెబ్రీ 9:28 కావున మన రక్షణకొరకు ఎదురుచూచెదము.

## సువార్త అబ్రాహామునకు బోధింపబడెను
## The Gospel preached to Abraham

సువార్తమొదట యూదుల పరమైయుండి యూదులకు బోధియపబడినను, అపొ.కా. 11:19 దేవుని ఉద్దేశపూర్వకముగా ఈ సువార్త అన్యజనాంగమును కూడా అకర్షించినది. అనగా "నీయందు అన్యజనులందరును ఆశీర్వదియపబడుదురు అని అబ్రాహామునకు సువార్త ముందుగా ప్రకటించెను" గలతీ 3:8 అను ఈ వాగ్దానమును బట్టి లోకస్తులందరు ఆశీర్వాదము నొందుదురు. అబ్రాహాము ద్వారా లోకస్తులందరూ ఆశీర్వాదము పొందబోవు యీ సువార్తనే యేసు క్రీస్తు ఆయన శిష్యులకు బోధించెను. అబ్రాహాముయొక్క వాగ్దానమేమైయున్నదో పౌలు చెప్పుచున్నాడు. "నిన్ను (అబ్రాహాము) గొప్పజనముగా చేసి నిన్ను ఆశీర్వదించి నీ నామమును గొప్పచేసెదను, నీవు ఆశీర్వాదముగా నుందువు...... భూమియొక్క సమస్త వంశములు నీయందు ఆశీర్వదియపబడునని అబ్రాహాముతో అనెను" ఆది.కా. 12:2,3, మరియు పాలస్తీనా దేశమందు అబ్రాహామును తూర్పుతట్టు, పడమరతట్టు, ఉత్తరముతట్టు, దక్షిణముతట్టును త్రిప్పి చూపించి "యీ దేశమంతటిని నీకును నీ సంతానమునకు సదాకాలము ఇచ్చెదను" ఆది.కా. 13:14-17 అనెను. అబ్రాహామునకును అతని తదుపరి సంతానమునకును యీ వాగ్దానము ఒకేవిధముగా చేయబడినను ఇస్సాకు యాకోబులు కూడా యీ వాగ్దానమును ఎన్నడూ రుచిచూడలేదు. కావున యేసు క్రీస్తు వారిని గూర్చి "ఆ దినమున దేవుని రాజ్యములు...... అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులుండుట మీరు చూతురని" ప్రత్యేకముగ దేవుని రాజ్యమును వారు పొందబోవు కాలమునుగూర్చి చెప్పెను. ఈ వాగ్దానములు అబ్రాహాము సంతతికి లేక వంశమున కియ్యబడెను. అయితే అన్యజనాంగమునకు కూడా అర్హత కలిగియున్నదనుటలో 'సంతతి' యను పదము ఏక వచనము కావచ్చును, బహువచనము కావచ్చును. పౌలు అబ్రాహాము సంతతినిగూర్చి ప్రత్యేకముగ

"అబ్రాహామునకును ఆయన సంతానమునకు వాగ్దానములు చేయబడెను. ఆయన అనేకులనుగూర్చి అన్నట్టు సంతానమునకు అని చెప్పక ఒకనిగూర్చి అన్నట్లే నీ సంతానమునకు అనెను. ఆ సంతానము క్రీస్తు గలతీ 3:16 అని చెప్పుటలో యూదులలో యేసు క్రీస్తు వంశము గొప్పదిగా ఎంచబడెను. అట్టి యేసు క్రీస్తు ద్వారా సర్వలోకములో ఆయనకు వారసులుగా నున్న అబ్రాహాము సంతానమునకు చెందినవారందరు ఆ వాగ్దానము పొందునట్లుగా "మీరు క్రీస్తు సంబంధులైతే ( అనగా క్రీస్తులో బాప్తిస్మము పొందితే) ఆ పక్షమందు అబ్రాహాముయొక్క సంతానమైయుండి వాగ్దానప్రకారము వారసులైయున్నారు" గలతీ 3:29 అని పౌలు చెప్పుచున్నాడు. గనుక ఏ దేశస్తుడైనను, స్త్రీయైనను, పురుషుడైనను క్రీస్తువాడుగా నుండవచ్చును గలతీ 3:28. అనగా యూదుడు, అన్యులు, స్త్రీ పురుషులందరును అబ్రాహామునకివ్వబడిన వాగ్దానములో వారసులుగ నుండవచ్చును. అట్టి రీతిగ అబ్రాహాము, ఇస్సాకు, యాకోబు ద్వారా మార్గమేర్పడిన సువార్తనంగీకరించిన వారందరికి దేవుని రాజ్యములో పాలిభాగమొందుటకు సదవకాశము కలిగెను.

## ఒక రక్షకుడు అవసరమాయెను

## A Saviour needed

సువార్త వర్తమానములో యేసు క్రీస్తు మధ్యస్థాయిని కలిగియుండెను. ఏలయనగా "యేసు క్రీస్తు అను ఈ నామము ద్వారానే తప్ప ఆకాశముక్రింద నియ్యబడిన మరి యేనామమున రక్షణ పొందలేము" అపొ.కా. 4:12 అని వక్కాణించబడినట్లు అబ్రాహాము కివ్వబడిన వాగ్దానము యేసు ఒక్కని ద్వారానే పొందగలము. కావున మనము పొందు రక్షణకు మార్గమైన యేసు క్రీస్తును గూర్చిన వర్తమానమే సువార్తయైయున్నది. ఏమనగా "రక్తమాంసములు దేవునిరాజ్యము స్వతంత్రించుకొననేరవు" 1 కొరింథీ 15:50 అని వ్రాయబడినట్టు రక్తమాంసములు సహజముగ నాశనమొంది యీ మర్త్యదేహమునుండి అమర్త్యములోనికి మార్గమైన క్రీస్తు ద్వారా మార్పుచెందుటయే రక్షణ అయియున్నది.

మనమెందుకు చెనిపోవుచున్నాము అను ప్రశ్నకు సమాధానముగా

మనమందరము దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించి పాపమునకు దాసులగుటచేత చావునకు లోనైతిమని బైబిలు చెప్పుచున్నది. ఆదాము స్వభావము మనము కలిగియుండుటచేత మరణము మనపై నిలిచెను రోమా 5:15. ఇదిట్లుండగా, మరణము నుండి విడుదల చేయుటకుగాను యేసు పుట్టెను. ఆయన జన్మింపకముందు ఆయన తల్లికి "తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును" మత్తయి 1:21 అని యేసునుగూర్చి దూతచెప్పెను. "అందరును పాపముచేసి దేవుడనుగ్రహించు మహిమను పొందలేకపోవుచున్నారు" రోమా 3:23 అను వాక్యము ద్వారా పాపాత్ములమైన మనము క్రీస్తు ద్వారా క్షమాపణనొంది నిత్యమరణమునుండి విడుదల పొందగలము.

## దేవుని గొర్రెపిల్ల

## The Lamb of God

"లోకపాపమును మోసికొనుపోవు దేవుని గొర్రెపిల్ల" యోహాను 1:25 వలె యేసు క్రీస్తు సిలువపై బలి అయినందున పాపములు క్షమించి విడుదలచేయుటకు మధ్యవర్తియాయెను హెబ్రీ 9:26 ఈ బలియాగము దేవుడెందులకంగీకరించెనో "క్రీస్తు సిలువ" అను మా 14 నెం॥ పుస్తకము చదువ మనవి.

ఈ బలియాగము పాపక్షమాపణ కోరువారికొరకుగనుక అట్టి క్షమాపణ కోరువారు పాపముద్వారా మరణము సంభవించినదని వారు మొదట గుర్తింపవలెను. రెండవదిగా "మచ్చలేని గొర్రెపిల్ల" యని వ్రాయబడిన రీతిగా యేసు పాపములేనివాడై పాపమునుండి విడుదలచేయుటకు అధికారము పొందియుండెను. తన్ను అనుసరించు స్త్రీ పురుషులను రక్షించుటకుగాను ఆయన అందరివలె మరణించుటకు బలియాయెను గనుక యేసు క్రీస్తు మనుష్యకుమారునిగాను, దేవుని కుమారునిగాను అసాధారణమైన స్థాయిని పొందెను. పాపముద్వారా మనకు కలిగిన అనేక ప్రేరణల నుండి దేవుని కుమారుడు విడుదల చేయగలడు. ఏలయనగా "ఆయన పాపములేని వాడు, ఆయననోట ఏ కపటములేదు" 1పేతురు 2:22. ఆయన తన తండ్రికి విధేయుడై అనగా సిలువమరణము పొందునంతగా విధేయత చూపినవాడై "తన్ను తాను తగ్గించుకొనెను" ఫిలిప్పీ 2:8 సిలువ మరణమే ప్రాముఖ్య భాగముగా తన

జీవితములో ఎంచెను. ఆదాము వంశమువలె తాను మరణింపవలసివచ్చెను కాని యేసు తాను మరణించనగత్యములేదు. అయినను మరణించి మూడవ దినమున తిరిగి లేచి నిత్యస్వాస్థ్యమను దేవుని బహుమతిని పొందెను.

ఈ విధముగా క్రీస్తు బలి లోకమంతటికి రక్షణయై ఆయన జీవిత మరణములతో పాలిభాగమొందువారికి పాపపు శక్తిని ఓడించుటకు ఆయన సహాయపడును. ఏలయనగా ఒక మనుష్యుని అవిధేయతవలన అనేకులు ఏలాగు పాపులుగా చేయబడిరో ఆలాగే ఒకని విధేయతవలన అనేకులు నీతిమంతులుగా చేయబడుదురు " రోమా 5:19 పాపములు క్షమింపబడినపుడే నిత్యజీవమును పొందగలరు. అప్పుడే ఆ గొప్ప అడ్డుబండ అయిన పాపపు స్వాభావము తొలగింపబడును. మన కనుగ్రహింపబడుచున్న యీ మంచి అవకాశము దేవుని ప్రేమయైయున్నది.

"దేవుడు లోకమునెంతో ప్రేమించెను కాగా ఆయన తన అద్వితీయ కుమారునిగా పుట్టినవానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు అనుగ్రహింపబడెను" యోహాను 3:16.

కాబట్టి దేవుని రాజ్యమును మనము పొందగోరినయెడల పాపపు మరణమునుండి విడుదలనొంది సమృద్ధి జీవముకొరకు నిరీక్షించుటయే మూలము. దేవుడిచ్చు బహుమానము షరతులలోనే ఇమిడియున్నది. రక్షింపబడే ప్రతివానికి క్రీస్తే మార్గము.

## నమ్మకము

## Belief

"నమ్మికయుంచువాడే " నిత్యజీవముకలవాడని యేసు చెప్పెను. నమ్మికయనునది రక్షణమార్గమునకు మొదటి మెట్టుగానున్నది. సువార్తమానము కేవలము దేవుని రాజ్యమునుగూర్చి కాదుగాని ఆ రాజ్యమునకు మార్గము యేసేయని చూపించుచున్నది. ఈ సువార్త గ్రహించి దానియెడల బాధ్యతకలిగి విశ్వాసముంచువారి అందరి జీవితములను మార్చును. "సువార్త యందు విశ్వాసముంచి

మారుమనస్సుపొందుమని " మార్కు 1:15 యేసు అరచుచున్నాడు. నమ్మిక దేవునియెడల విశ్వాసము కలిగించి చిన్న బిడ్డవంటి విశ్వాసహృదయమును అనుగ్రహించును.

"మీరు మార్పునొంది బిడ్డలవంటివారైతేనే గాని పరలోకరాజ్యములోనికి ప్రవేశింపరని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను" మత్తయి 18:3.

## బాప్తిస్మము అనుసరించుట
## Followed by Baptism

ప్రత్యేకమైన విధేయత కలిగినపుడే నమ్మికయనునది హృదయమందు ఏర్పడును. క్రీస్తు తన శిష్యులతో సర్వసృష్టికి వెళ్ళి సువార్త ప్రకటించమని చెప్పినపుడు "నమ్మి బాప్తిస్మము పొందువారు రక్షింపబడుదురు" మార్కు 16:16 అని కూడా వేర్పించెను. బాప్తిస్మము అనునది రక్షణలో ఏర్పరచబడిన మెట్టుగానున్నది.

అపొస్తలుల కాలమందు సువార్తవిని, మార్పుచెందిన వారందరు వెంటనే బాప్తిస్మము నొందిరి. వారందరు "ఫిలిప్పు దేవుని రాజ్యమును గూర్చియు యేసు క్రీస్తు నామమును గూర్చియు ప్రకటించుచుండగా వారతని నమ్మి పురుషులును, స్త్రీలును బాప్తిస్మము పొందిరి" అపొ.కా. 8:12 బాప్తిస్మము ద్వారా నీ పాతజీవితమంతయు పాతిపెట్టబడును. "మీరు మారు మనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసు క్రీస్తు నామమున బాప్తిస్మము పొందండి" అపొ.కా. 2:38 అని అపొస్తలులు బోధించెను. పాతజీవితమంతయు పగులగొట్టబడి నూతన బాంధవ్యము పొందుట బాప్తిస్మమైయున్నది. ఏలయనగా "క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరు క్రీస్తును ధరించుకొనియున్నారు" గలతీ 3:27. నీటిలో పూర్తిగా ముంచబడుట ద్వారా క్రీస్తు మరణ పునరుత్థానములో పాలివారమైయున్నామని పౌలు వివరించినాడు.

"మనము బాప్తిస్మమువలన మరణములో పాలుపొందుటకై ఆయనతో కూడా పాతిపెట్టబడితిమి" రోమా 6:4 తత్ఫలితముగా:-

"ఏలయనగా ఆయన చనిపోవుట చూడగా, పాపము విషయమై ఒక్కసారే చనిపోయెనుగాని జీవించుట చూడగా దేవుని విషయమై జీవించుచున్నాడు. అటువలె

మీరును పాపము విషయమై మృతులుగాను దేవుని విషయమై క్రీస్తు యేసునందు సజీవులుగాను మిమ్మును మీరే యెంచుకొనుడి" రోమా 6:6,10,11.

## నూతన బాంధవ్యము

## A New Relationship

క్రీస్తులో బాప్తిస్మము పొంది సువార్త ద్వారా నమ్మికకలిగిన ప్రతివాడును గత పాపములోనుండి విడుదల నొందినవాడై అబ్రాహాము సంతతికి చెంది ఇప్పుడు క్రీస్తులోనున్నాడు. ఇది యేసు క్రీస్తునందలి నూతన సంబంధము. బాప్తిస్మము పొందుట ద్వారా పాపములో చచ్చినవారై యేసు క్రీస్తు ద్వారా దేవునిలో నివసించుటయే క్రీస్తుతో పొత్తు కుదుర్చుకొనుట. తద్వారా అబ్రాహాముయొక్క నిరీక్షణలో భాగము పొంది దేవుని రాజ్యములో నిత్యజీవమును పొందుటయే దేవుని బహుమానము.

తరతరములనుండి మనలను వెంబడించుచున్న పాపములు, అనారోగ్యములనుండి పరిశుద్ధత పొందుటకు యేసు క్రీస్తు ఒక్కడే మార్గమైయున్నాడు. దేవుని సహాయము క్రీస్తు ద్వారా పొందు బహుమానము దేవుని రాజ్యములోనికి నిత్యజీవము కలిగి జీవించుటయే.

ఈ వర్తమానమే రక్షణనుగూర్చిన శుభవర్తమానమైనది. నశించుచున్న మానవునికి రక్షణనిచ్చి దేవుని రాజ్యములో భాగము పొందునట్లు యేసు క్రీస్తు రక్షణమార్గమైయున్నాడు.

ఏమి తిందుమో ఏమి త్రాగుదుమో ఏమి ధరించుకొందుమోయని చింతిపకుడి....... ఇవన్నియు మీకు కావలెనని మీ పరలోకపుతండ్రికి తెలియును. గనుక మొదటి సువార్త నిరీక్షణ యేమనగా:-